సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 28 । జనవరి । 2025



జాతరో జాతర

మాఘ అమావాస్య జాతరలతో కూడవెల్లి, మోయతుమ్మెద వాగుల తీరాలు భక్తులతో సందడిగా మారనున్నాయి.


వివరాలు 8లో ▸



ప్రియుడితో కలిసి భర్తను...

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసింది భార్య. సంగారెడ్డి జిల్లా రెడ్డి ఖానాపూర్ గ్రామంలో ఘటన చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▸



హజ్ హౌస్‌కు నిధుల గ్రహణం!

నిరుపేద ముస్లిం మైనార్టీ కుటుంబాల్లో వివాహ, ఇతర వేడుకల నిర్వహణకు నిర్మిస్తున్న హజ్ హౌస్ పనులు నిధుల కొరతతో ఆగిపోయాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాల



స్కూల్ భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమ సహకారంతో గ్రామాల్లో పాఠశాల భవనాలు నిర్మించి ఉన్నత విద్యను అందించడం అభినందనీయం అని ఎంపీ రఘునందర్‌రావు పేర్కొన్నారు. జిన్నారం మండలం కాజీపల్లి గ్రామంలో సోమవారం కెమ్‌టెక్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో 1.9కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పరిశ్రమలు అందిస్తున్న సహకారం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, పరిశ్రమ ఎండి గుల్లపల్లి గోపికృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన 28.49 లక్షల విలువైన 85 చెక్కులను నియోజకవర్గంలోని సంగారెడ్డి పట్టణం, కొండాపూర్, కంది మండలాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, పాండు మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మైనార్టీ గురుకుల ప్రవేశాలు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ మైనారిటీ గురుకులం పటాన్‌చెరు బాలికల-1 పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను మైనారిటీ విద్యార్థులకు 5వ తరగతి నుంచి ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ, బైపీసీ) వరకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 5 వ తరగతిలో 80, 6వ తరగతి- 28, 7వ తరగతి- 22, 8వ తరగతిలో -17 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ఫస్టియర్‌లో 80 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం సంబంధిత వెబ్‌సైట్ లేదా పటాన్‌చెరు బాలికలు-1 పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7995057882, 8106721827 లను సంప్రదించాలన్నారు.

రేపు ఉద్యోగ మేళా

సంగారెడ్డి రూరల్: జిల్లాలోని నిరుద్యోగులకు బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పేటీఎం, ఎంఎస్‌ఎన్ లేబొరేటిస్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు విద్యార్హతలు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీలో కెమిస్ట్రీ పాసై 35 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువపత్రాలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి బుధవారం ఉ.11 గంటలోపు హాజరు కావాలని కోరారు.

తెల్లాపూర్ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా ఫాల్గుణ్‌రావు



బాధ్యతలు చేపట్టిన ఫాల్గుణ్ రావు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేక పాలన అధికారులను నియమించింది. దీంతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా నియమితులైన మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ ఫాల్గుణ్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి హాజరయ్యారు.

టూరిజంకు సింగూరు భూములు

- ప్రస్తుతానికి మూడు ఎకరాలు
- రానున్న రోజుల్లో మరిన్ని కేటాయింపులు
- ఇతర అవసరాల కోసం 30 ఎకరాలు రెవెన్యూకు బదలాయింపు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నీటి పారుదలశాఖకు చెందిన భూములను రెవెన్యూశాఖకు బదలాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. పుల్కల్ మండలంలో ఇప్పటికే పలుమార్లు ఈ శాఖ భూములను ఇతర ప్రజా అవసరాల కోసం బదలాయించగా... తాజాగా మరో 30 ఎకరాలను రెవెన్యూశాఖకు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ 30 ఎకరాల్లో ప్రస్తుతానికి మూడు ఎకరాలు పర్యాటక శాఖకు కేటాయించారు. సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు మధ్యలో ఉన్న ఐలాండ్‌ను అభివృద్ధి చేయడంతోపాటు, ఈ ప్రాంతంలో కాటేజీలు నిర్మించాలని భావిస్తున్నారు. వాచ్‌టవర్, రెస్టారెంట్, ఫుడ్‌కోర్టు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకు సకల సౌకర్యాలు కల్పించాలని భావిస్తున్నారు.

బదలాయింపుపై గతంలోనే ఆదేశాలు

నీటికి అవసరమైన భూములను రెవెన్యూ శాఖకు బదలాయించాలని నీటిపారుదల శాఖ అధికారులకు గతంలోనే ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో పుల్కల్ మండల పరిధిలో ఉన్న సుమారు 30 ఎకరాలను రెవెన్యూశాఖకు అప్పగించినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. కాగా, సింగూరు జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని భావిస్తున్నారు. నీటి పారుదలశాఖకు సింగూరు ప్రాజెక్టు సమీపంలోని బస్వాపూర్, ముద్దాయిపేట తదితర గ్రామ శివారుల్లో సుమారు రెండు వందల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఈ భూములను నీటి పారుదలశాఖ సేకరించింది. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ఉంచుకునేందుకు ఇతర అవసరాల కోసం ఈ భూములను అప్పట్లో సేకరించింది. ఈ భూములు ఇప్పుడు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికే గురుకుల పాఠశాల, పాలకేంద్రం వంటి వాటికి ఈ భూములను కేటాయించారు. తాజా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కూడా ఈ నీటి పారుదలశాఖ భూముల్లోనే చేపట్టారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తామని ఎన్నికల్లో హామి ఇచ్చిన విషయం తెలిసిందే.



సింగూరు రిజర్వాయర్ ముందు భాగం (ఫైల్)


ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఇటీవలే శంకుస్థాపన

జిల్లాలో అందోల్ నియోజకవర్గానికి సంబంధించిన ఈ స్కూల్ నిర్మాణానికి ఈ నీటిపారుదలశాఖ భూముల్లోనే ఇటీవల శంకుస్థాపన జరిగింది. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన నవోదయ పాఠశాలను కూడా ఇదే భూముల్లో ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. నీటి పారుదల శాఖకు పెద్ద ఎత్తున అందుబాటులో ఉన్న ఈ భూములను ప్రజా అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇటీవల తమ శాఖకు సంబంధించి సుమారు 30 ఎకరాల భూములను రెవెన్యూశాఖకు అప్పగిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొన్నారు.

పంచాయతీ పోరుకు సిద్ధం!

నోటిఫికేషన్ కోసం నిరీక్షణ

- రెడీగా 3,285 బ్యాలెట్ బాక్స్‌లు
- 20 లక్షల పేపర్లు ప్రింటింగ్
- కర్ణాటక నుంచి తెప్పించిన మరికొన్ని బాక్స్‌లు
- సర్పంచ్, వార్డు సభ్యులకు గుర్తుల కేటాయింపు



సంగారెడ్డి జోన్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ పేపర్ ముద్రణ పూర్తి అయ్యింది. సర్పంచ్ పదవికి 30, వార్డు సభ్యుడు పదవికి 20 రకాల గుర్తులను కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు..

జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 27 మండలాలు, 646 గ్రామపంచాయతీలు, 5,718 వార్డులు ఉన్నాయి. జిల్లాలోని అందోల్ నియోజకవర్గంలో 143 గ్రామ పంచాయతీలలో 1,65,627 మంది ఓటర్లు ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 195గ్రామ పంచాయతీలలో 1,89,215, నర్సాపూర్ నియోజకవర్గంలో హత్నూర మండలంలో 42,350, పటాన్ చెరు నియోజకవర్గంలో 44గ్రామ పంచాయతీలలో 1,20,613, సంగారెడ్డి నియోజకవర్గం 87 గ్రామపంచాయతీలలో 1,33,339, జహీరాబాద్ నియోజకవర్గంలో 139 గ్రామపంచాయతీలలో 2,00,276 మంది ఓటర్లతో కూడిన తుది జాబితాను ఇప్పటికే అధికారులు విడుదల చేశారు. ఈ విధంగా మొత్తం జిల్లాలో 8,51,420 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో 5,732 పోలింగ్ స్టేషన్లు

జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలలో మౌలిక వసతులు కల్పిస్తూ, దూరాభారం తగ్గిస్తూ 5,732 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ తుది జాబితాను ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ అంశాలపై జిల్లాలోని వివిధ శాఖల అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సర్పంచ్ పదవికి, వార్డు సభ్యుడు పదవికి గుర్తులను కేటాయిస్తూ సంబంధిత బ్యాలెట్ పత్రాలపై ముద్రణ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలోని ఓటర్ల సంఖ్య మేరకు 20% అదనంగా ముద్రించారు. సర్పంచ్ కోసం పది లక్షలు, వార్డు సభ్యుడు కోసం పది లక్షలు మొత్తంగా 20 లక్షల బ్యాలెట్ పత్రాలను గుర్తులతో ముద్రించారు. ఎన్నికల్లో ముఖ్యమైన బ్యాలెట్ బాక్సులు సైతం సిద్ధంగా ఉంచారు. పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి 783 తెప్పించగా మొత్తం 3,285 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

నోటిఫికేషనే తరువాయి...



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లు, నోడల్ ఆఫీసర్ల నియామకం పూర్తయ్యింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేటాయించిన గుర్తులను బ్యాలెట్ పేపర్లపై ముద్రించారు. -సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి

పర్యాటక కేంద్రంగా సింగూరు



అధికారులతో కలసి ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- పర్యాటకుల రాకతో ఆయా గ్రామాలకు మహర్దశ
- క్యాసారం నుంచి సింగూరు వరకు బోటింగ్
- రూ.100కోట్ల అంచనా
- మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): సింగూరు ప్రాజెక్టును రూ.100కోట్ల వ్యయంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారు సింగూరు ప్రాజెక్టు నుంచి మక్తక్యాసారం వరకు, పర్యాటక కేంద్రాలకు అనువైన స్థలాలతో పాటు పొడైన రోడ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రాజెక్టులో మధ్యభాగంలో పడకంటి గడ్డను ద్వీపంగా అభివృద్ధి చేసి అక్కడ అందమైన భవనాన్ని నిర్మించి వాటి వద్దకు వెళ్లేందుకు రెండు బోట్‌లను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఖాళీ చేసిన పునరావాస పాత సింగూరు గ్రామంలో టూరిస్టులకోసం కాటేజీలను నిర్మిస్తామని వెల్లడించారు. బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న హరిత రెస్టారెంట్‌ను సందర్శించి వంటశాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం బుస్సారెడ్డిపల్లి గ్రామం మీదుగా మల్లికార్జునపల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తక్కడపల్లి నుంచి గార్లపల్లి మీదుగా మంజీర నదిపై నిర్మించే బ్రిడ్జిని, రోడ్డును పరిశీలించారు. టూరిజం ఏర్పాటయితే చుట్టుపక్కల సుమారు 17 గ్రామాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఆశాజ్యోతి, సర్వేయర్ సునీత, పర్యాటక శాఖ అధికారులు, ఇరిగేషన్ ఈఈ భీం పాల్గొన్నారు.

తెలంగాణ నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి: తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ డైరీ, క్యాలెండర్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. నందర్భంగా నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు కొత్త వైద్య కళాశాలల్లో సీనియర్ నర్సింగ్ అధికారుల పోస్టింగ్‌లను పెంచాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

హెచ్‌ఆర్ పెంచాలి: పీఆర్‌టీయూ



ఏటీవో శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల హెచ్‌ఆర్‌ను పెంచాలని పీఆర్‌టీయూ నాయకులు సోమవారం అదనపు కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం మాట్లాడుతూ...జహీరాబాద్‌కు8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు 13% హెచ్‌ఆర్ పెంచాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు బాగయ్య, ఆశోక్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 65 దరఖాస్తులు



సంగారెడ్డి జోన్: సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 65 మంది తమ సమస్యలను విన్నవించుకుంటూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజా రాణి ,ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పఠన నైపుణ్యాలు పెంచుకోవాలి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: విద్యార్థుల పఠన నైపుణ్యాలు పెంచుకునేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు పేర్కొన్నారు. రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శేఖాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లైబ్రరీల వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు





మహాసభకు హాజరైన పార్టీ శ్రేణులు, మాట్లాడుతున్న విజయ రాఘవన్, చిత్రంలో తమ్మినేని

ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలివ్వాలి

- కొనసాగుతున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు
- పలు తీర్మానాలకు ఆమోదం

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.6 లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని, ఆ మొత్తాన్ని రూ.15లక్షలకు పెంచాలని సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్ ఓ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర మహాసభలలో సోమవారం పలు ప్రజాసమస్యలను చర్చించి తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని, ప్రభుత్వ అసైన్డ్ భూములు, సాగులో లేని భూములను గుర్తించి, ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి 30 లక్షల మంది కార్మికులున్నారని తక్షణమే కనీస వేతన జీవోను సవరించి వారికి రూ.26 వేలు వేతనంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో మూడో వంతు వ్యవసాయం 20 లక్షల మంది కౌలు రైతులు చేస్తున్నారని వీరందరినీ సాగుదారులుగా గుర్తించాలన్నారు. మోదీ ప్రభుత్వం 2003 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకంలో పనిదినాలకు 200 రోజులకు పెంచడంతోపాటు కూలీ రూ.600 చేయాలని కోరారు.

మూసీ బాధితులకు అండగా...

మూసీ ప్రక్షాళన బాధితులకు అండగా ఉండాలని మహాసభలో ప్రతిపాదించినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం భూ సేకరణ జరుగుతుందని, భూములు, ఉపాధి కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని తీర్మానాలను ఆమోదించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పొలిట్ బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్, భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, సీపీఎం ఆహ్వాన కమిటీ చైర్మన్ చుక్కా రాములు తదితరులు పాల్గొన్నారు.

అల్లంత దూరం.. ఆత్మీయ భరోసా

మున్సిపాలిటీల్లో పేద మహిళలకు వర్తించని పథకం

- గ్రామీణులకే అమలు
- పురపాలికల్లో లేని ఉపాధి హామీ పనులు



నారాయణఖేడ్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీల్లోని వ్యవసాయ కూలీల్లో ఆందోళన నెలకొంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ భూమి లేని గ్రామీణస్థాయి పేద వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకుగాను గ్రామసభల్లో భూమిలేని పేద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఉపాధిహామీ పథకంలో పనులకు వెళ్లిన వారిని ఈ ఆత్మీయభరోసా పథకానికి ఎంపిక చేశారు. ఎంపిక కాని వారిని గ్రామసభల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించగా 4,700మంది జిల్లాలో దరఖాస్తులు అందజేశారు.

మున్సిపాలిటీల్లో ఉపాధి కార్డులేవీ!

గ్రామీణస్థాయి పేదల వరకు ఈ పథకం అమలు బాగున్నా మున్సిపాలిటీల్లోని పేద వారికి పథకం దక్కకుండా మారింది. మున్సిపాలిటీల్లో ఉపాధి హామీ పథకం కొనసాగదు. ఇక్కడి వారికి జాబ్ కార్డులు లేవు. గతంలో పంచాయతీలుగా ఉన్న సమయంలో జాబ్ కార్డులు కలిగి ఉన్నా ప్రస్తుతం మున్సిపాలిటీల్లో ఉపాధిహామీ పథకం లేనందున అవి ఉపయోగంలో లేవు. మున్సిపాలిటీల్లోని భూమిలేని వ్యవసాయ కూలీల ఎంపికకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ఇక్కడ పేద మహిళలను ఎలా ఎంపిక చేయాలన్న సందేహాలు నెలకొన్నాయి. మున్సిపాలిటీల్లోని వార్డుల్లో జరిగిన గ్రామసభల్లో భూమిలేని పేదలు తమకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలంటూ దరఖాస్తులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించలేదు. ఇందుకు సంబంధించి లబ్ధిదారులు దరఖాస్తులు ఇచ్చినా స్వీకరించలేదు. దరఖాస్తు చేసుకునేందుకు మార్గదర్శకాలు లేకపోవడంతో సదరు దరఖాస్తును వ్యవసాయ అధికారులు ఇవ్వాలంటూ గ్రామసభల్లో సూచించారు. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే తమకు ఎలాంటి మార్గదర్శకాలు లేవని వారు సమాధానం చెప్పారు. దీంతో మున్సిపాలిటీల్లోని పేదవారు దరఖాస్తులను సమర్పించలేకపోయారు.

విలీన గ్రామాలకు అమలు...

ఇటీవల నూతనంగా మున్సిపాలిటీలుగా మారిన, మారుతున్న మున్సిపాలిటీల్లో విలీనం అవుతున్న గ్రామాల్లోని పేదలకు పథకంలో అవకాశం కల్పించారు. విలీన గ్రామాల్లో గతేడాది 20 రోజులు పని చేసిన భూమిలేని పేదల దరఖాస్తులు స్వీకరించారు. కానీ పాత మున్సిపాలిటీల్లో, అంతకుముందు ఏర్పాటైన మున్సిపాలిటీల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించలేదు.

మున్సిపాలిటీల్లోనే ఎక్కువ పేదలు

మున్సిపాలిటీల్లోనూ భారీ సంఖ్యలో భూమిలేని పేదలు నివసిస్తున్నారు. ఇక్కడి మహిళలకు పథకంపై స్పష్టత రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. విషయాలను ఆయా మున్సిపాలిటీల కమిషనర్ల వద్ద ప్రస్తావించగా పథకంకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని, ఎవరైనా దరఖాస్తు సమర్పిస్తే తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్- జోగిపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 7.86లక్షల జనాభా నివసిస్తోంది. ఇందులో భూమిలేని పేదలు భారీ సంఖ్యలోనే ఉండనున్నారు.

క్లుప్తంగా

హోరాహోరీగా కుస్తీ పోటీలు



వెండి కడియం బహూకరిస్తున్న చైర్మన్

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ శివారులో కొనసాగిన ఉర్సు వేడుకల్లో భాగంగా సోమవారం కుస్తీపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బాబాగౌడ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. డప్పుల చప్పుళ్లు, చప్పట్లతో ప్రేక్షకులు మల్లయోధులను ఉత్సాహ పరిచారు. కొబ్బరికాయలు, నగదు, వెండి కడియాలకు సంబంధించిన 8 స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు వీరభద్ర ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాబాగౌడ్, డైరెక్టర్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, ఏఎంసీ మాజీ చైర్మన్ కేదారినాథ్, వైస్ చైర్మన్ మహంకాళి, భక్తులు ఉన్నారు.

రైతు భరోసా దరఖాస్తులకు 31 గడువు

కంగ్టి(నారాయణఖేడ్): రైతు భరోసా పథకం పొందేందుకు కొత్త పట్టాదారులు నిర్దేశిత దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఏఈఓలకు 31లోపు అందించాలని ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. దరఖాస్తుతో పాటు భూభారతి పట్టాదారు పాస్‌పుస్తకం లేక డిజిటల్ సంతకం చేసిన డాక్యుమెంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ జతచేసి సంబంధిత ఏఈఓలకు సమర్పించాలని, పాత పట్టాదారులు(భూ విస్తీర్ణంలో మార్పులు లేనివారు) దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పటాన్‌చెరు టౌన్: భర్త ఎంత చెప్పినా మద్యం సేవించడం మానివేయడం లేదని.. మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన భార్య చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి లివర్ డ్యామేజ్ కావడంతో భార్య సుష్మ మద్యం సేవించొద్దని చెప్పడంతో నాగరాజు మానేశాడు. తిరిగి జనవరి 1 నుంచి మద్యం సేవించడం మొదలుపెట్టాడు. ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవిస్తుండడంతో.. నీకంటే ముందే నేనే చనిపోతానని భర్తతో చెప్పి ఈ నెల 21న రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సుష్మను చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

సంగారెడ్డి క్రైమ్: రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని శాంతినగర్ చెందిన ఎండీ.జాంగీర్ బైక్‌పై నమాజ్ నిమిత్తం మసీదుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో జరిద్ర హాస్పిటల్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్ మరో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జాంగీర్‌కు గాయాలు కాగా పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువకుడు అదృశ్యమైన ఘటన చిలప్‌చెడ్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సోమవారం ఎస్ఐ నర్సింలు కథనం మేరకు.. గంగారం గ్రామానికి చెందిన వడ్డె రాజు (27), భార్య రాణితో తరుచూ గొడవ పడేవాడు. 20న రాణి తల్లితండ్రులు ఇంటికొచ్చారు. ఆ రోజూ కూడా భార్య, ఆమె తల్లిదండ్రులతో సైతం గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు.

జాతరో జాతర

రేపటి నుంచే కూడవెల్లి రామలింగేశ్వరస్వామి, సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి జాతర్లు



కూడవెల్లి రామలింగేశ్వరదేవాలయం

మాఘ అమావాస్య జాతరలతో కూడవెల్లి, మోయతుమ్మెద వాగుల తీరాలు భక్తులతో సందడిగా మారనున్నాయి. బుధవారం నుంచే ప్రారంభమయ్యే జాతర్లకు గాను అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయం, కోహెడ్‌లోని శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఒక్క రోజే రెండు జాతర్లు ప్రారంభం అవుతుండటంతో భక్తులు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. రెండు ఆలయాలు చుట్టుపక్కల ఎంతో ప్రసిద్ధిగాంచినవి కావడంతో జాతరకు సరిహద్దు జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు. ఆలయ నిర్వాహకులు సైతం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాత్కాలికంగా స్నానపు గదులు

ఆలయానికి వచ్చే భక్తులు క్యూ పద్ధతిలో వెళ్లి దైవ దర్శనం చేసుకోవడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. నీటి గుండంలో స్నానమాచరించే భక్తులకు తాత్కాలికంగా స్నానపు గదులు నిర్మించారు. ముందస్తుగా దేవాలయ ఆవరణలో మిఠాయిల దుకాణాలు, ఇతర బొమ్మల దుకాణాలు వెలిశాయి. అదే విధంగా దేవాలయ ఆవరణలో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా ప్రత్యేకించి పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.



భక్తులు స్నానమాచరించే నీటి గుండాలు

- మాఘ అమావాస్య రోజు పెద్ద ఎత్తున నిర్వహణ
- ముస్తాబైన ఆలయాలు
- భారీ సంఖ్యలో భక్తులు రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో 29 నుంచి జాతర ప్రారంభమవుతుంది. జాతరకు సరిహద్దు జిల్లాలైన మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, రాజన్నసిరిసిల్లా జిల్లా, కరీంనగర్ జిల్లాలకు చెందిన భక్తులే కాకుండా సరిహద్దు రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఐదు రోజుల వరకు ఈ జాతర జరుగుతుంది. కూడవెల్లికి తూర్పు దిక్కున పెద్ద వాగు, పడమరన చిన్నవాగు ఉంటాయి. ఈ రెండు వాగులు ఒకే చోట ఉత్తర దిశన ప్రవహిస్తాయి. మాఘ అమావాస్య రోజున కూడవెల్లి వాగులో స్నానం చేస్తే సకల పాపాలు తొలగి పోతాయని భక్తుల నమ్మకం. జాతర దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్షేత్రంలో గల దేవాలయాలు

రామలింగేశ్వరాస్వామి దేవాలయంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, రాధ రుక్మిణి వేణు గోపాలస్వామి, మహా గణపతి, వీరభద్ర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, బొబ్బిలి వీరన్న, హనుమాన్ దేవాలయాలు కలవు. కూడవెల్లి వాగులో మాఘ అమావాస్య రోజున శ్రీరామ చంద్రుడు వాగులో స్నాన మచారించాడు గనుగ అదే రోజు భక్తులు వాగులో స్నానమాచరించి దైవ దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగి పోతాయని భక్తుల నమ్మకం.

పూజా కార్యక్రమాలు

మాఘ అమావాస్య బుధవారం రోజున స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సర్వదర్శనం, సాయంత్రం స్వామి వారిని పల్లకీ సేవలో ఊరేగిస్తారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం స్వామి వారికి అభిషేకం, బిల్వా అర్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం రోజు ప్రతఃకాల స్వామి వారికి విశేష దేవ్యాలతో అభిషేకం బిల్వార్చన పుష్పార్చన, మంత్రపుష్పం హారతి తీర్థప్రసాద వితరణ భక్తులకు సర్వదర్శనాలు. ప్రదోష కాలంలో అభిషేకం అర్చన హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద్ వితరణ.



దేవాలయ ఆవరణలో ..

ప్రకృతి ఒడిలో సింగరాయుడు

కోహెడ(హుస్నాబాద్): చుట్టూ ఎతైన కొండలు, పచ్చని చెట్లు, జల జల పారే సేలయేరు ప్రకృతి రమణీయాల మధ్య శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి కొలువు దీరారు. కూరెల్లా, తంగళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల సరిహద్దులో 29న జాతర వైభవంగా జరుగనుంది. కాకతీయుల కాలంలో ప్రతాపరుద్రుడు, సింగరాయ అనే వాస్తుశిల్పిని మోయతుమ్మెద వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి పంపారు. ప్రాజెక్ట్ వద్ద ఉన్న ప్రకృతి దృశ్యాలకు ఆయన మంత్రముగ్దుడై అక్కడే స్థిరపడ్డాడని చరిత్రకారులు చెబుతారు. ఆయన మరణాంతరం కాకతీయులు రాజైన ప్రతాపరుద్రుడు, వాస్తు శిల్పి సింగరాయల పేర్లను కలుపుకొని శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనర్సింహ జాతరగా కొనసాగుతూ ప్రసిద్ధికెక్కింది. జాతరకు తెలంగాణ జిల్లాల నుంచి, మహారాష్ట్రలోని ముంబాయి, పూణే, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక రోజు జాతర జరగడం విశేషం. కోహెడ, శనిగరం, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల నలువైపుల నుంచి చేరేందుకు భక్తులకు రహదారులున్నాయి.

జాతర ప్రత్యేకత..

జాతరలో చిక్కుడు, టమాట, వంకాయ కూరగాయల మిశ్రమ శాఖాహార వంటలు వండుకొని కుటుంబ సభ్యులు సహా పంక్తి భోజనాలు భుజించడం ఇక్కడి ప్రత్యేకత. తూర్పు నుంచి పడమరకు పారే సేలయేరు ఉండటంతో దక్షిణకాశీగా అభివర్ణిస్తారు. ఈ సేలయేటిలో స్నానాలు ఆచరిస్తే చర్మవ్యాధులు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



లక్ష్మీ నర్సింహస్వామి

రెవెన్యూ శాఖ పరిధిలో నిర్వహణ..

కూరెల్లా, తంగళ్లపల్లి గ్రామాల మధ్య సరిహద్దుపై జాతర నిర్వహణలో వివాదం గత దశాబ్ది కాలం నుంచి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు గ్రామాల పెద్దలతో తహసీల్దార్ సురేఖ, ఎస్ఐ అభిలాష్ ఇటీవలె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇరు గ్రామాల పెద్దల వాదనలు విన్నారు. వారి మధ్య సక్యత కుదరకపోవడతో రెవెన్యూ శాఖ జాతర నిర్వహణ బాధ్యతలు తీసుకుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేకించి పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాం. భక్తులకు సహాయం పడేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేశాం. మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు కలిగితే కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలి.

–విశ్వనాథశర్మ, ఆలయ ఈఓ

ఐదు రోజులు జాతర



మాఘ అమావాస్య సందర్భంగా జాతర ప్రారంభమతుంది. మాండవ్య నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. ఐదు రోజుల వరకు జాతర కొనసాగుతుంది. భక్తులు క్యూ లైన్‌లో వెళ్లి దైవ దర్శనం చేసుకోవాలి. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సంకేత్ శర్మ, ఆలయ అర్చకులు

అరుణ్ ఐస్‌క్రీమ్ కొత్త మైలురాయి



కిడ్స్ అడ్వెంచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

- రోజుకు 1.27లక్షల కిలోల ఐస్‌క్రీమ్ ఉత్పత్తితో..
- సంస్థ ప్రతినిధి ఆర్.జి.చంద్రమోగన్ వెల్లడి
- 'కిడ్స్ అడ్వెంచర్ ఎడ్యుకేషన్'లో పాల్గొన్న విద్యార్థులు



హట్సన్ కర్మాగారం చైర్మన్ ఆర్.జి.చంద్రమోగన్

జహీరాబాద్: హట్సన్ అగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్ బ్రాండ్ అరుణ్ ఐస్‌క్రీమ్స్ రోజుకు 1.27 లక్షల కిలోల ఐస్‌క్రీమ్‌ను ఉత్పత్తి చేస్తూ కొత్త మైలురాయిని సాధించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఆర్.జి.చంద్రమోగన్ వెల్లడించారు. జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్‌గ్రామంలోని హట్సన్ కర్మాగారంలో ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న 'కిడ్స్ అడ్వెంచర్ ఎడ్యుకేషన్' కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే అరుణ్ ఐస్‌క్రీమ్ సంస్థ అతిపెద్ద తయారీ యూనిట్‌గా గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌లో అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో పాటు అధునాతన పరికరాలు ఉన్నాయని ఇవి ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను అధిక సామర్థ్యం, కచ్చితత్వం, నాణ్యతతో ఉత్పత్తి చేయడంలో సహాయపడతాయని తెలిపారు. అదేవిధంగా గోవింద్‌పూర్ ప్లాంట్‌లో పర్యావరణహిత కార్యక్రమాలు చేపడుతున్నామని ఇందులోభాగంగా వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, నీటి శుద్ధి, రీసైక్లింగ్ ప్రక్రియలు, అలాగే సౌరశక్తి ఆధారిత విద్యుత్ వినియోగం ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ స్కూళ్లు, కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

- పరిశ్రమకు కరెంట్ సరఫరా కోసం రూ.50 వేలు డిమాండ్



మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమకు కరెంట్ సరఫరా చేయడానికి రూ.50 వేలు డిమాండ్ చేసిన విద్యుత్‌శాఖ ఏఈ ఏసీబీ అధికారులకు చిక్కాడు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ పరిశ్రామిక వాడలో నూతనంగా లక్కీ ఇండ్రస్ట్రీస్ యజమాని(పేరు గోప్యంగా ఉంచారు) పరిశ్రమ నిర్మించారు. ఈ పరిశ్రమకు విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను బిగించారు. దీనికి విద్యుత్ సరఫరా కోసం ఏఈ కృష్ణను సంప్రదించగా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. పరిశ్రమ యజమాని రూ.30 వేలకు ఒప్పందం చేసుకొని 17వ తేదీన రూ.10 వేలు ఇచ్చాడు. కాగా ఏఈ మిగితా డబ్బుల కోసం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. సోమవారం కాళ్లకల్‌లోని విద్యుత్ కార్యాలయంలో బాధితుడు రూ.20 వేలు ఏఈ కృష్ణకు అందజేశాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ చేపట్టి నాంపల్లి ఏసీబీ కోర్టు (2వ అదనపు స్పెషల్ కోర్టు)లో హాజరుపరుస్తామని తెలిపారు.

విలేకరి అరెస్ట్, రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: ప్రెస్ రిపోర్టర్ అని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ పట్టణ సీఐ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని నర్సిఖేడ్ వీధికి చెందిన చింతల సిద్దిరాములు మెగా ఇండియా యూట్యూబ్ ఛానెల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీన పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓ లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేయడంతో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిద్దిరాములుపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



సదానందం(ఫైల్)



స్వామి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లికి చెందిన మైలారం స్వామి(26) పెయింటింగ్ వర్క్ చేస్తుండగా, సంగుపల్లికి చెందిన మన్నె సదానందం(27) ఫ్లవర్ డెకరేషన్ పని చేస్తున్నాడు. ఇద్దరూ ఆదివారం రాత్రి గజ్వేల్ నుంచి ముట్రాజ్‌పల్లి వైపు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో మహిళా భవనం మలుపు వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌తోపాటు విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు ఘటనా స్థలానికి చేరుకోగా, సమాచారం అందుకున్న పోలీసులు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్, ఆటో ఢీకొని వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని రాంపల్లి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాంపల్లి గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి(40) దుద్దెడ శివారులో గల టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. రాంపల్లి గ్రామం నుంచి ఆక్సిజన్ పార్కు వద్ద ఉన్న రాజీవ్ రహదారికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి రాంపల్లికి ఇనుప రేకులతో వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నరేందర్‌రెడ్డి (ఫైల్)

ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని టైలర్ కాలనీకి చెందిన కుమార్ (29) సోమవారం ఉదయం ఫిట్స్ వచ్చి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి సోదరుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు

సంగారెడ్డి: జిల్లా కేంద్ర సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ముగియడంతో సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి దంపతులతో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు శాలువాలు, పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి మాట్లాడుతూ.. 15 ఏళ్లగా మూడు పర్యాయాలు చైర్ పర్సన్‌గా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మొదటి సారి అప్పటి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సహకారంతో తర్వాత చోటు చేసుకున్న పరిణామాల్లో ప్రస్తుత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో పదవిని చేపట్టి పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో రూ. 145 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని వివరించారు. అభివద్ధికి సహకరించిన కౌన్సిలర్ల, కో ఆప్షన్ సభ్యులకు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, మేనేజర్ సూర్య ప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకవర్గంతో మున్సిపల్ అధికారులు

స్కూలు బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడు మృతి

గుమ్మడిదల మండలంలో ఘటన

జిన్నారం(పటాన్‌చెరు): స్కూలు బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన భజరంగి చౌహాన్ భార్య నిషాదేవి దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం బొంతపల్లి గ్రామానికి వచ్చి ఉంటున్నారు. సోమవారం భార్యాభర్తలిద్దరూ పిల్లలను ఇంటి వద్ద వదిలి పనులకు వెళ్లారు. సాయంత్రం బాలుడు సంతోష్ (7) ఆడుకుంటూ బాలానగర్–నర్సాపూర్ ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా బాలానగర్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తల్లి నిషాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



బాలుడి మృతదేహం వద్ద పడిపోయిన తల్లి



ఆదేశాల అమలేది?

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టవద్దన్న హైకోర్టు ఆదేశాలు పారిశుధ్య సిబ్బంది యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. జీవవైవిధ్య స్థలంగా గుర్తించిన అమీన్‌పూర్ పట్టణంలోని పెద్దచెరువు వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను సోమవారం తగలబెట్టగా 'సాక్షి' కంటికి చిక్కింది. పర్యావరణానికి హాని కలిగించేలా చెత్త తగలబెట్టడాన్ని అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశాలు కచ్చితంగా అమలు చేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. –పటాన్‌చెరు

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్త హత్య
- మృతదేహాన్ని గ్రామ శివారులో పడేసిన వైనం
- ఏమీ తెలియనట్లు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు
- భార్యతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో ఘటన



నారాయణ(ఫైల్)



లక్ష్మీ (ఫైల్)



రాకేశ్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసింది భార్య. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మల్లె నారాయణ(42) మూడేళ్ల కిందట ఉపాధి నిమిత్తం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామానికొచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గ్రామంలోనే ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కార్యాలయంలో సీఈవోగా పని చేస్తున్నాడు. భార్య లక్ష్మీ సొంత మల్లుపల్లి గ్రామంలోనే ఉండేది. నాలుగు రోజుల కిందట భర్త వద్దకు రెడ్డి ఖానాపూర్ గ్రామానికి వచ్చింది. లక్ష్మీకి బిక్నూర్ మండలం రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కడారి రాకేశ్‌తో వివాహేత సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయం తెలిసి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఎలాగైన భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. పథకం ప్రకారం శుక్రవారం రాత్రి ప్రియుడు రాకేశ్, బిక్నూర్ గ్రామానికి చెందిన సాగర్ రమేశ్, దప్పు శ్రీకాంత్, కడారి శ్రీకాంత్‌తో కలిసి భర్త నారాయణను రెడ్డి ఖానాపూర్ గ్రామ శివారులోని సొసైటీ కార్యాలయం వద్ద హత్య చేసి మృతదేహాన్ని పల్పనూరు గ్రామ శివారులో పడి వేశారు. మరుసటి రోజు (శనివారం) ఏమీ తెలియనట్లు భర్త కనిపించడం లేదని హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం గ్రామ ఉదయం శివారులో మృతదేహం ఉందనే సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పటాన్ చెరువు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నదిముద్దీన్ పరిశీలించారు. అనుమానితురాలుగా ఉన్న భార్యను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకుంది. లక్ష్మీ, రాకేశ్‌తోపాటు వీరికి సహకరించిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. లక్ష్మీ సైతం బీజేపీ బీసీ మహిళా మండలాధ్యక్షురాలు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.